క్లుప్తంగా

నేడు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

పెదకాకాని: నూతనంగా పెదకాకాని గ్రామంలో నిర్మించిన సచివాలయం 1, గొడపాలెంలోని సీసీ రోడ్డు, కమ్యూనిటీ హాలును పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మంగళవారం ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొనాలని పేర్కొన్నారు.

పెట్రోల్ ట్యాంక్‌కు రంధ్రం పడి బైక్ దగ్ధం



పెదకాకాని: బైక్ పెట్రోల్ ట్యాంక్‌కు రంధ్రం పడి దగ్ధమైన ఘటన నంబూరు అడ్డరోడ్డులో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. విజయవాడ వైపు నుంచి సోమవారం పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు నంబూరు అడ్డరోడ్డులోని పెట్రోల్‌బంక్ వద్ద ఆగి బైక్‌కు ఫుల్ ట్యాంక్ ఆయిల్ కొట్టించారు. అనంతరం ట్యాంక్‌కు ఏర్పడిన రంధ్రం నుంచి ఆయిల్ కారడం ప్రారంభమైంది. ఆయిల్ ట్యాంక్‌లోని పెట్రోల్ ఇంజన్‌పై పడటం, అప్పటికే ఇంజన్ బాగా వేడెక్కి ఉండటంతో మంటలు అంటుకుని కొద్దిసేపటికే బైక్ కాలిపోయింది. బంక్ సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అదుపులోకి రాలేదు. కాలిపోయిన బైక్‌ను యువకులు అక్కడే వదిలి వెళ్లిపోవడంతో.. బంక్‌లో మంటలు వ్యాపించాయి. స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

ఉపాధ్యాయుడు ప్రసాద్‌కు మిరాకిల్స్ వరల్డ్ అవార్డు



గుంటూరు ఎడ్యుకేషన్: శుభాంజలి కళావేదిక వ్యవస్థాపకుడు, గాయకుడు, ఉత్తమ ఉపాధ్యాయుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ మిరాకిల్ వరల్డ్ రికార్డ్ అందుకున్నారు. అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో 12 గంటల పాటు 129 ఘంటసాల గీతాల్ని నిర్విరామంగా ఆలపించడం ద్వారా మిరాకిల్స్ సంస్థ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా సోమవారం అరండల్‌పేటలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పురుషోత్తమ ప్రసాద్‌ను ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. నరసింహారావు, డెమొక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జువ్వా జ్ఞానేశ్వరరావు, బీసీ ఉద్యోగ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వరగాని శివనాగేశ్వరరావు, సాధం సత్యనారాయణ అభినందించారు.

మనుస్మృతి ప్రతుల దహనం

నెహ్రూనగర్: లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మను స్మృతి ప్రతుల్ని దహనం చేశారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.జయసుధ మాట్లాడుతూ ఎస్సీ బీసీ మైనార్టీ, మహిళల హక్కుల్ని కాలరాచే మను స్మృతిని బాబాసాహెబ్ దహనం చేశారని గుర్తు చేశారు. మనువాద శక్తులు భారత రాజ్యాంగాన్ని తొలగించి, మనుస్మృతిని అమలు చేయాలని డిమాండ్ చేయడం దేశాన్ని అనాగరిక స్థితిలోకి తీసుకు వెళ్లడమేనని విమర్శించారు. మనువాద శక్తుల నుంచి అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఆమె కోరారు.

డాక్టర్ ఈసీ గంగిరెడ్డి పుస్తకం బహూకరణ



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ ఈసీ గంగిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన జీవిత విశేషాలతో రూపొందించిన పుస్తకాన్ని రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళికి అవర్ స్టేట్-అవర్ లీడర్-వైఎస్సార్ ఇంటిలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి బహుకరించారు. శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలకు హాజరైన పోసాని కృష్ణమురళిని కలిసిన శాంతమూర్తి ఆయనను సత్కరించి, పేదల వైద్యుడు డాక్టర్ ఈసీ గంగిరెడ్డి జ్ఞాపకాల పుస్తకాన్ని అందజేసినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ ప్రార్థనలు



చేబ్రోలు: నారాకోడూరులో విద్యుత్ కాంతుల్లో వెలిగిపోతున్న చర్చి



చేబ్రోలు: చెరువోలపాలెంలో కాంతులీనుతున్న ప్రార్థన మందిరం



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



ప్రార్థన చేస్తున్న ఫాదర్ కనపర్తి ఆశీర్వాదం



పాల్గొన్న క్రైస్తవులు

పొన్నూరు: లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా సోమవారం క్రిస్మస్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం రాత్రి నుంచే క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవులు అధిక సంఖ్యలో చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, క్రిస్మస్ సందేశాన్ని భక్తులకు అందించారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పాత పొన్నూరులోని లూథరన్ చర్చిలో రెవరెండ్ పాస్టర్ కనపర్తి ఆశీర్వాదం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, క్రిస్మస్ సందేశమిచ్చారు. లోక రక్షకుడిగా ఏసు క్రీస్తు అందరికీ ప్రభువై ఉన్నారన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని ప్రతి ఒక్క క్రైస్తవుడు ప్రేమానురాగాలను పదిమందికి పంచుతూ, పేదలకు అన్న, వస్త్ర దానాలు చేయాలని తెలిపారు.

చేబ్రోలు: క్రిస్మస్ వేడుకలు మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా ప్రార్థన మందిరాలను అందంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాల వెలుగుల్లో కాంతులీనాయి. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నారాకోడూరు, సుద్దపల్లి, చేబ్రోలు, పాతరెడ్డిపాలెం, కొత్తరెడ్డిపాలెం, శలపాడు, శేకూరు, వేజండ్ల, వడ్లమూడి గ్రామాల్లో క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రధాన చర్చిలను శోభయమానంగా తీర్చిదిద్దారు. పేద ప్రజల అభ్యున్నతి కోసమే లోకరక్షకుడు జన్మించాడని అందుకే ఆయన జననాన్ని క్రైస్తవ సోదరులంతా పండుగగా జరుపుకుంటున్నారని ఫాదర్ శ్యాంసోన్ అన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నప్పుడే దేవుని కృప పొందేందుకు అర్హులవుతారన్నారు. వడ్లమూడి గరువుపాలెం ప్రాంతంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొన్నారు. స్థానిక చర్చిలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సుమారు వందమంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ మోరంపూడి అనితారాణి, స్థానికులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

రేపు తక్కెళ్లపాడులో బజరంగ్ సంక్షేమ సంగమం శిబిరం

బజరంగ్ నేత్రజ్యోతి ద్వారా నేత్ర వైద్య శిబిరం, మీ గుండె పదిలం, దివ్యాంగ దర్శిని, ఫిజియోథెరపీ సేవలు



పెదకాకాని: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బజరంగ్ సంక్షేమ సంగమం శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ తెలియజేశారు. ఈ నెల 27వ తేదీ నిర్వహించే శిబిరం ద్వారా బజరంగ్ నేత్రజ్యోతి, మీ గుండె పదిలం, బజరంగ్ దివ్యాంగ దర్శిని, ఫిజియోథెరఫీ సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఇటీవల ఉప్పలపాడులో నిర్వహించిన ఈ శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడంతో బుధవారం తక్కెళ్లపాడు జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నేత్రజ్యోతి ద్వారా అవసరమైన వారికి వారం రోజుల్లో కళ్లజోళ్లు అందజేయడం జరుగుతుందన్నారు. మీ గుండె పదిలం ద్వారా అవసరమైన వారికి యాంజియోగ్రాములు, గుండె ఆపరేషన్లు, స్టెంట్లు వేయించడం జరుగుతుందన్నారు. అలానే దివ్యాంగులకు ఉచితంగా త్రిచక్ర వాహనాలు, జైపూర్ కాళ్లు, వెస్టన్ కమోడ్‌లు సమకూర్చడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు మద్దతుగా బజరంగ్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాలు గ్రామ గ్రామాన విరివిస్తూ ప్రజల సౌకర్యార్థం ఈ సేవలను మీ ముంగిట్లోకి తీసుకు రావడం జరిగిందన్నారు. గ్రామ ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ తెలియజేశారు.

అత్యంత వైభవంగా ఆరుద్రోత్సవం రేపు



మల్లేశ్వరస్వామి మూలవిరాట్

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం ఆరుద్రోత్సవం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు సోమవారం తెలిపారు. ఆరుద్రోత్సవం విశిష్టతను దేవస్థాన అర్చకులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణ వరప్రసాద్ వివరిస్తూ సూర్యుడు ధనస్సు రాశిలో ప్రవేశించిన పిమ్మట ధనుర్మాసంలో వచ్చు ఆరుద్రా నక్షత్రంన ఈశ్వరునికి ఆరుద్రోత్సవం, తెల్లవారుజామున ఉత్తరద్వార దర్శనం జరుగుతుందన్నారు. ఈ రోజున ఈశ్వరునికి పంచామృతాలు, అన్నాభిషేకం నిర్వహించడం జరుగుతుందన్నారు. దీంతో పాడి పంటలు వృద్ధి కలిగి, దేశమంతా సశ్యశ్యామలమై విరాజిల్లుతుందన్నారు. దీనినే శివముక్కోటి అని కూడా అంటారన్నారు. 108 కేజీలతో అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అన్నాభిషేకం తదుపరి మూడు ప్రసాదాలు (పులిహోర, చక్ర పొంగలి, దధ్యోజనం) తయారు చేసి భక్తులకు ప్రసాదంగా అందించనున్నట్లు చెప్పారు. ఆరుద్రోత్సవం రోజు తెల్లవారుజామున 4 గంటలకు బ్రాహ్మీ ముహూర్తాన విఘ్నేశ్వరపూజ, పుణ్యాహ వచన, మహన్యాస్యపూర్వక ఏకాథ రుద్ర అన్నాభిషేకం విశేషంగా నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని చెప్పారు. దేవాలయ సహాయ కమీషనరు ఎస్.శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి అమ్మిశెట్టి శివశంకరరావు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే సీఎం జగన్ లక్ష్యం



ఆట స్థలాల పరిశీలనలో ఎమ్మెల్సీ హనుమంతరావు, సమన్వయకర్త చిరంజీవి, కమిషనర్



దుగ్గిరాలలో ఆట స్థలాలు పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లి రూరల్ : దేశంలో ఏ ప్రభుత్వం నిర్వహించని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్, మంగళగిరి వైఎస్సార్ సీపీ సమన్వకకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధిలో నేటి నుంచి పోటీలు నిర్వహించనున్న సోమవారం కమిషనర్ నిర్మల్ కుమార్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త గంజి చిరంజీవి మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలో మొత్తం 12 ఆట స్థలాల్ని అధికారులు సిద్ధం చేశారని తెలిపారు. గుంటూరు జిల్లా నల్లపాడులో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి క్రీడల్ని ప్రారంభించగానే ఎంటీఎంసీ పరిధిలో ఆటల పోటీలు జరుగుతాయని చెప్పారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 65 సచివాలయాల్లో ఇప్పటికే క్రీడల్లో పాల్గొనేందుకు 19,148 మంది, వీక్షించేందుకు 12,053 మంది పేర్లను నమోదు చేసుకున్నారని వెల్లడించారు. గతంలో నమోదు చేసుకున్న క్రీడాకారులే కాకుండా అప్పటికప్పుడు పేర్లు నమోదు చేసుకుని అధికారుల అనుమతితో క్రీడల్లో పాల్గొనవచ్చని వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, ఎంటీఎంసీ సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో....

మండల పరిధిలోని 18 గ్రామాల్లో జరిగే ఆడుదాం ఆంధ్రా క్రీడలకు ఎంపీడీవో వీరయ్య క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేశారు. సోమవారం వాటిని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు పరిశీలించారు. కార్యక్రమంలో దుగ్గిరాల వైస్ ప్రెసిడెంట్ నాగూర్, బాజీ, జమ్ముల లోకేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయండి

తాడేపల్లి రూరల్ : 'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం నుంచి జరుగనున్న క్రీడల కోసం ఏర్పాటు చేసిన ఆట స్థలాల్ని డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి, సెక్రటరీ శ్రీనివాసరావులతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ మాట్లాడుతూ ఒక్కొక్క గ్రౌండ్ పరిధిలో 5 నుంచి 7 సచివాలయ పరిధిలో క్రీడలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సచివాలయ పరిధిలోని సిబ్బంది అందరూ ఈ ఆటల పోటీల ఏర్పాట్లను నిరంతరం పరిశీలిస్తారన్నారు. క్రీడాకారుల్ని ఆహ్వానించడంతో పాటు కొత్తగా పేర్లు నమోదు చేసేందుకు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి క్రీడా ప్రాంగణంలో ఎమర్జెనీ వైద్య నిమిత్తం సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నామని, 12 ఆట స్థలాలకు సంబంధించి 108 వాహనాన్ని కూడా సిద్ధంగా ఉంచనున్నట్లు ఆయన తెలిపారు. క్రీడాకారులకు తాగునీటితో పాటు మౌలిక సదుపాయాల్ని కల్పిస్తున్నామని ఆయన చెప్పారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వికలాంగుల కాలనీలో నివసించే షేక్ సైదాబి (42) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. దీంతో మానసికంగా కుంగిపోయి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. బుచ్చయ్యతోటకు చెందిన క్షత్రియ నరేంద్ర సింగ్ (34) నిత్యం మద్యం తాగి తిరుగుతుంటాడు. ఈనెల 14న పూటుగా మద్యం తాగి ఇంటి వద్ద కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఈశ్వరీ బాయి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కెటిల్ బెల్ పోటీల్లో గుంటూరు క్రీడాకారులకు గోల్డ్‌మెడల్స్



క్రీడాకారులతో డాక్టర్ రాఘవ శర్మ

గుంటూరు మెడికల్: వరల్డ్ కెటిల్ బెల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆసియా చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు ముంబైలో జరిగాయి. పోటీల్లో ఏపీకి చెందిన ముగ్గురు క్రీడాకారులు పాల్గొని రెండు బంగారు, రెండు రజిత, ఒక కాంస్య పతకం సాధించినట్లు ఏపీ గిరెవోయ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, గుంటూరు లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ పి.వి.రాఘవశర్మ తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని లలితా హాస్పిటల్‌లో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పతకాలు సాధించిన క్రీడాకారుల్ని అభినందించారు. వన్ ఆర్మ్ లాంగ్ సైకిల్ 24 కేజీల కెటిల్‌బెల్ 30 నిమిషాలు ఆఫ్ మారథాన్‌లో మొహమ్మద్ అనాస్ గోల్డ్‌మెడల్ సాధించినట్లు డాక్టర్ రాఘవ శర్మ చెప్పారు. వన్ ఆర్మ్ లాంగ్ సైకిల్ 24 కిలోల కెటిల్‌బెల్ 10 నిమిషాల క్లాసిక్ పోటీలో బంగారు పతకం, వన్‌ఆర్మ్ లాంగ్ సైకిల్ 24 కిలోల కెటిల్‌బెల్ 30 నిమిషాల ఆఫ్ మారథాన్‌లో కాంస్య పతకాన్ని మొహమ్మద్ జావిద్ గెలుపొందినట్లు తెలిపారు. డాక్టర్ నీలిమ 2 ఆర్మ్ లాంగ్ సైకిల్, వన్ ఆర్మ్ లాంగ్ సైకిల్ కెటిల్‌బెల్ పోటీల్లో రజత పతకాలు సాధించినట్లు వెల్లడించారు. గుంటూరుకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో జరిగిన క్రీడల్లో బంగారు పతకాలు సాధించడం చాలా గర్వంగా ఉందని డాక్టర్ రాఘవశర్మ పేర్కొన్నారు.

'కేంద్రియ' విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్రీయ విద్యాలయాల్లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయుల సమస్యల్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అఖిల భారత కేంద్రీయ విద్యాలయాల విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు విజ్ఞప్తి చేశారు. రింగ్ రోడ్డులో సోమవారం క్యాంపు కార్యాలయంలో కలసిన సంఘ ప్రతినిధులు కేవీడీ ప్రసాద్, ఎన్. చలపతి, బి. శివనాగేశ్వరరావు, కేవీపీఎస్ఎస్ హైదరాబాద్ రీజియన్ అధ్యక్షుడు బీఎస్వీ సీతారామ్, ఎండీ నసీమ్ ఆయనకు వినతి పత్రం సమర్పించారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఎంఏసీపీ సమస్యతో పాటు సీజీహెచ్ఎస్ సదుపాయాల్ని తక్షణమే పునరుద్ధరించే విధంగా సంబంధిత మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రారంభానికి నోచుకోని కేంద్రీయ విద్యాలయాలను అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు అమరావతి రీజియన్ ప్రాంతీయ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రీయ విద్యాలయాల్లో నిలిపివేసిన గ్రాండ్ చిల్డ్రన్ కోటాను పునరుద్ధరించాలని కోరారు. సంబంధిత మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారీసుపేటకు చెందిన 72 ఏళ్ల సుభాని ఆదివారం రాత్రి ఫస్ట్‌షోకు సినిమాకు వెళ్లాడు. 10.30 గంటల సమయంలో తన స్కూటీపై ఇంటికి వెళుతుండగా గిరి రోడ్డులో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తలకు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించగా ప్రకాశం రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడికి సత్కారం

తెనాలిటౌన్: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షునిగా నియమింపబడిన వేముల మహేష్‌ను పార్టీ నాయకులు సత్కరించారు. నందివెలుగులోని మహేష్ స్వగృహంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దూళిపాళ్ళ పవన్‌కుమార్, పార్టీ నాయకులు మహేష్‌ను శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ నాయకులు ధన్యవాదాలు మహేష్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొంత నగేంద్ర రెడ్డి, కానుగోలు సురేష్, దుర్గాప్రసాద్, తన్నీరు వెంకటేశ్వరరావు, కంచర్లపాలెం గ్రామ కన్వీనర్ పాదిలి శ్రీనివాసరావు, ఎర్రగుంట్ల బుల్లయ్య, కల్యాణం శివనాగేశ్వరావు, పేరం మణికంత, షేక్ షిలార్‌బాబులు పాల్గొన్నారు.

సాహితీ రుద్రమ్మ లక్ష్మీకాంతమ్మ



లక్ష్మీకాంతమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఫోరం సభ్యులు

బాపట్ల అర్బన్: ఆంధ్ర కవయిత్రుల చరిత్ర గ్రంథస్తం చేసి, తెలుగు సాహిత్య చరిత్రలో డాక్టర్ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ సుస్థిర స్థానం సంపాదించారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు అన్నారు. లక్ష్మీకాంతమ్మ జయంతి సందర్భంగా సోమవారం టౌన్ హాల్లోని ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. సంస్కృతాంధ్ర భాషలలో దీటైన లక్ష్మీకాంతమ్మ మొత్తం 18 పుస్తకాలు రచించారని చెప్పారు. ప్రచండ వక్తృత్వ ప్రావీణ్యానికి ఆమె సాహితీ రుద్రమ బిరుదును అందుకున్నారని తెలిపారు. కేరళ ప్రభుత్వం ప్రచురించిన ప్రపంచ సాహిత్య చరిత్రలో ఆమె రచనలకు స్థానం దక్కిందని వెల్లడించారు. స్వాతంత్రోద్యమం, ఆంధ్రోద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి కళా ప్రపూర్ణ పురస్కారాన్ని అందుకున్నారన్నారు. ఆమె రచనలపై పరిశోధనలు చేసి పలువురు పిహెచ్‌డీ పట్టాలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు, న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రేపట్నుంచి చంద్రశేఖరస్వామి 81వ ఆరుద్ర మహోత్సవాలు

పెదకాకాని: గంగాభ్రమరాంబ సమేత చంద్రశేఖరస్వామి 81వ ఆరుద్ర మహోత్సవాలు ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవాల నిర్వాహక సంఘం సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కెళ్లపాడు గ్రామంలో ఐదు రోజుల పాటు వైభవంగా నిత్యం పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, నామ సంకీర్తనలు జరుగుతాయన్నారు. ప్రతి రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ నెల 28 సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు శివతత్వంపై ప్రవచనం చేస్తారని నిర్వాహక కమిటీ సభ్యులు తెలియజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఉద్యోగం పేరిట మోసం

తెనాలిరూరల్: ఉద్యోగం పేరిట సోషల్ మీడియాలో వచ్చిన యాడ్‌ను చూసి డబ్బులు చెల్లించి ఓ యువతి మోసపోయింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ ఐతానగర్‌లో నివసిస్తున్న మమత సోషల్ మీడియాలో కొద్ది రోజుల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామన్న యాడ్‌ను చూస అక్కడ ఉన్న నంబరుకు కాల్ చేసింది. వారు సూచించిన విధంగా రూ. 30 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేసింది. అప్పటి నుంచి నంబరు పని చేయకపోవడం, ఎటువంటి సమాచారం లేకపోవడంతో సైబర్ విభాగాన్ని ఆశ్రయించింది. విభాగం నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమదు చేసినట్టు టూ టౌన్ పోలీసులు సోమవారం తెలిపారు.

నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

తెనాలిఅర్బన్: ఫిలదెల్ఫియా చర్చి ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన 2024వ సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం మారీసుపేట రెండుగేట్ల మధ్యలోని చర్చి ఆవరణలో బ్రదర్ ఆనందన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాలెండర్‌లో ఉన్న దేవుని వాఖ్యాలను ప్రతిరోజు చదువుకుని ఆశీర్వాదం పొందాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ చిలువూరి నతానియేల్, సంఘ పెద్దలు ప్రసాద్, డేవిడ్ సన్, పినపాటి స్టీవెన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో సామగ్రి దగ్ధం



కొల్లూరు : అగ్ని ప్రమాదంలో గృహంలోని దుస్తులు, సామగ్రీ దగ్ధమైన ఘటన కొల్లూరులో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. స్థానిక లాక్ సెంటర్ కనక దుర్గమ్మ ఆలయం వెంబడి నివసిస్తున్న అత్తలూరి అర్జునరావు అరటికాయల వ్యాపారి. అతని రేకుల ఇంటికి ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగల నుంచి ఒక్క సారిగా మంటలు మంటలు ఎగసిపడ్డాయి. దీంతో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు మంటలను గమనించి బయటకు పరుగులు తీశారు. మంటల తాకిడికి ఇంటిలోని విద్యుత్తు ఉపకరణాలు, దుస్తులు దగ్ధమయ్యాయి. సుమారు రూ. 60 వేలు వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.